
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 19 నవంబర్ 2025
5
తిరుపతి



శభాష్ గున్నయ్య



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పారిశుద్ధ్య విభాగం కార్మికుడిగా పనిచేస్తున్న గున్నయ్య మానవత్వాన్ని చాటుకున్నారు. దేవస్థానంకు చెందిన అతిథి గృహంలో భక్తుడు మరిచిపోయి వెళ్ళిన బంగారాన్ని తిరిగి అప్పగించి తన నిజాయితీని, మానవత్వాన్ని ప్రదర్శించారు. వివరాల్లోకి పోతే.. నెల్లూరుకు చెందిన శ్రీనివాసులు కుటుంబం ఈనెల 17న జ్ఞాన ప్రసూనాంబ అతిథి గృహంలో బస చేసింది. మంగళవారం దర్శనం పూర్తి కావడంతో హడావిడిగా స్వగ్రామం బయలుదేరి వెళ్లిపోయింది. ఆ సమయంలో గది శుభ్రపరిచేందుకు వెళ్లిన గున్నయ్యకు మంచం కింద పడిన రెండు బంగారు ఉంగరాలను గుర్తించారు. వాటిని అధికారులకు అప్పజెప్పడంతో తిరిగి శ్రీనివాసులు కుటుంబానికి అప్పగించారు. రెండు ఉంగరాల విలువ 1.60 లక్షలు ఉంటుందని అధికారులు తెలియజేశారు. ఆలయ ప్రతిష్టను పెంచేలా నిజాయితీని చాటుకున్న పారిశుద్ధ్య విభాగం కార్మికుడు గున్నయ్యను ఆలయ ఉద్యోగులు మెచ్చుకున్నారు.


మేయర్ శిరీష




కమిషనర్ మౌర్య

63 పంచాయతీలతో 'గ్రేటర్'

10 గ్రామాలు కొత్తగా విలీనం / అత్యవసర కౌన్సిల్లో తీర్మానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎట్టకేలకు గ్రేటర్లో రేణిగుంట, తిరుపతి రూరల్, చంద్రగిరి, ఏర్పేడు మండలాల్లో ఉన్న 63 పంచాయతీలను విలీనం కానున్నాయి. 10 లక్షల జనాభాతో గ్రేటర్ చేయాలని వైసిపి ప్రతిపాదించగా, 12 లక్షల జనాభా ఉండేలా కూటమి కార్పొరేటర్లు ప్రతిపాదించారు. ఆదాయం పెంచుకోడానికి ఉపయోగపడుతుందని, కార్పొరేటర్లందరూ ఒకసారి ఆలోచించాలని మేయర్ డాక్టర్ శిరీష ప్రతిపాదించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అత్యవసర కౌన్సిల్ సమావేశం ఎస్వి సెనెట్ హాల్లో మంగళవారం జరిగింది. తిరుపతి కార్పొరేషన్ ఆనుకుని ఉన్న పది గ్రామాలను గ్రేటర్లో కలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు.

గ్రేటర్ హైదరాబాద్ తరహా అభివృద్ధి : మేయర్

తిరుపతి ప్రజల దాహార్తి అందిస్తున్న కల్యాణిడ్యాం, రేణిగుంటలోని మల్లిమడుగు, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి మీదుగా ప్రవహిస్తున్న రాయలచెరువు గ్రేటర్లోకి తీసుకురావాలని, దీంతోపాటు ఏర్పేడులోని ఐఐటి, ఐజర్ కళాశాలలు, వడమాలపేట మండలంలోని అంజేరమ్మ కనుమ గ్రేటర్లోకి తీసుకునావాలని మేయర్ సూచించారు. వీటిని కలిపితే కార్పొరేషన్కు ఆదాయం పెరిగే అవకాశం ఉందని, గ్రేటర్ హైదరాబాద్ తరహాలో తిరుపతిని తీర్చిదిద్దాలని సూచించారు.

10 లక్షల జనాభా ఉంటేనే కేంద్ర నిధులు : ఎంపి

ఎంపి డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ తిరుపతి గ్రేటర్లో ఏర్పేడు మండలంలోని చిందేపల్లి గ్రామం వద్ద తిరుపతివాసుల గృహాలు ఉన్నాయని, వాటిని గ్రేటర్లోకి తీసుకురావాలన్నారు. ఏర్పేడు వద్ద సెంట్రల్ యూనివర్సిటీలు ఐఐటి, ఐజర్ ఉన్నాయని, అక్కడ మెట్రో ప్రాజెక్టులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రేటర్లో 10 లక్షల జనాభా ఉంటే కేంద్ర ప్రభుత్వ నిధులు వస్తాయన్నారు. ప్రస్తుతం ఉన్న 7 లక్షల 86వేల మంది జనాభాతో గ్రేటర్ చేస్తే నిధులు రావని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మాజీ ఎంఎల్ఏ భూమన కరుణాకర్రెడ్డి, డిప్యూటీ మాజీ మేయర్ భూమన అభినయ్రెడ్డి కృషితోనే 17 మాస్టర్ప్లాన్ రోడ్లు వేసి ట్రాఫిక్ సమస్య పరిష్కరించారన్నారు.

చంద్రబాబు విజన్తోనే గ్రేటర్ : ఆరణి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపుతోనే తిరుపతి గ్రేటర్ అవతరిస్తుందని, అవసరమైతే మరికొన్ని గ్రామాలు కలిపి మరోసారి ప్రతిపాదన పంపుదామని ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు సూచించారు. తిరుపతి మున్సిపాలిటీ ఏర్పడి 139 ఏళ్ళయ్యిందని, రాష్ట్ర విభజన తరువాత రాయలసీమలోనే తిరుపతి ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు విమర్శలు చేసుకోవద్దని, తిరుపతి అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఆదాయం వచ్చే గ్రామాలే గ్రేటర్లోకి : కమిషనర్

తిరుపతి గ్రేటర్లోకి ఆదాయం వచ్చే గ్రామాలను మాత్రమే కలుపుతున్నట్లు కమిషనర్ మౌర్య వెల్లడించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పది లక్షల జనాభాతోనే గ్రేటర్ చేయాలని అనుకున్నామని, ప్రస్తుతం 7 లక్షల 86వేలమంది ఉన్నారన్నారు. ఎక్కువ గ్రామాలను గ్రేటర్లో కలపడం వల్ల వారికి మౌలిక సదుపాయాలు కల్పించలేమన్నారు. ప్రస్తుతం తిరుపతి కార్పొరేషన్కు ఏడాదికి రూ.1049 కోట్లు ఆదాయం వస్తోందని, గ్రేటర్లో మరిన్ని గ్రామాలను విలీనం చేస్తే 190–220 కోట్ల ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ జీవో అనుగుణంగానే ఈ గ్రామాలను గ్రేటర్లోకి తీసుకొస్తామన్నారు. తిరుపతి కార్పొరేషన్ సంబంధించిన చెత్త రామచంద్రాపురం మండలంలోని రామాపురం వద్ద డంపింగ్ యార్డు ఉందని, దీన్ని గ్రేటర్లో కలుపుతూ నివేదిక తయారు చేశామన్నారు. కల్యాణిడ్యాంను గ్రేటర్లోకి తీసుకురాలేమన్నారు. అది అటవీశాఖ పరిధిలో ఉందన్నారు. ఏర్పేడు మండలంలోని ఐఐటి, ఐజర్ కళాశాలల్లో ఉన్నప్పటికీ గ్రేటర్కు వచ్చే ఆదాయం ఏమీ లేదన్నారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు బ్రాహ్మణపట్టును గ్రేటర్లోకి తీసుకొస్తామన్నారు.

పది పంచాయతీలు ఆమోదిస్తూ తీర్మానం... గ్రేటర్లో కొత్తగా చంద్రగిరి మండలంలోని కొన్ని గ్రామాలు రేణిగుంటలో మండలంలోని కొన్ని గ్రామాలు మొత్తం 10 గ్రామాలను కలుపుతూ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది

'భజన ప్రదర్శనలు' క్రమబద్ధీకరణ నిర్ణయం


స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్లో...

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమలలో అఖండ హరినామ సంకీర్తనకు రిజిస్టర్ అయిన 7856 భజన బందాలు నైపుణ్యాన్ని పరిశీలించి జిల్లాస్థాయిలో భజన ప్రదర్శనలను ఏర్పాటు చేసి వాటిని క్రమబద్ధీకరించాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో అనీల్కుమార్ సింఘాల్తో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్లో మంగళవారం టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే వేసవిలో తెలుగు రాష్ట్రాలలో 8,9,10 తరగతి విద్యార్థులకు 'సద్గమయ' కార్యక్రమం ద్వారా నైతిక విలువలు, మానవీయ ధర్మాలు, వ్యక్తిత్వ నిర్మాణానికై శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు జానకిదేవి, మహేందర్ రెడ్డి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ పాల్గొన్నారు.

స్విమ్స్లో
304 పోస్టుల భర్తీకి గ్రీన్సిగ్నల్

అంతకుముందు స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 236 స్టాఫ్ నర్సులు, 20 పారా మెడికల్ సిబ్బంది, 48 అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల భర్తీకి గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మొత్తం 304 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, సదాశివరావు, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కుమార్ పాల్గొన్నారు.

సతీష్ మృతిపై హైకోర్టు షాక్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పరకామణి చోరీ కేసు సంబంధించి మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. టిటిడి మాజీ ఎవిఎస్ఒ సతీష్కుమార్ మృతిపై కోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. సాక్ష్యులతో పాటు నిందితుడు రవికుమార్కు రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తు పూర్తయ్యేవరకూ రక్షణ కల్పించాలని సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ను ఆదేశించింది. సతీష్కుమార్ మృతిపై షాక్కు గురయ్యామని కోర్టు పేర్కొంది. ఈ కేసు దర్యాప్తు వేగవంతానికి సిఐడి డిజి, కిందిస్థాయి అధికారులు సైతం పాల్గొనేందుకు కోర్టు వెసులుబాటు కల్పించింది. తదుపరి విచారణ డిసెంబర్ 2కు వాయిదా వేసింది.

ఇదిలా ఉండగా తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశం మంగళవారం తిరుమల అన్నమయ్య భవన్లో జరిగింది. ఈ సమావేశంలో పరకామణిలోచోరీ ఘటనపై కీలక నిర్ణయం చేసింది. ఈ సమావేశంలో ఛైర్మన్ మాట్లాడుతూ పరకామణి చోరీ ఘటనపై మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లోక్ అదాలత్ రాజీ వెనుక ఉన్న కుట్రను తేల్చాలని తీర్మానం చేశారు. గతంలో నమోదైన కేసు పరిధి పరిమితంగా ఉండడంతో ఇటీవల కాలంలోనూ మరిన్ని చోరీ ఘటనల దృష్ట్యా మరో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. తిరుమల వన్టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.



రేపు తిరుపతికి రాష్ట్రపతి రాక

అడుగడుగునా భద్రత

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము తిరుపతి పర్యటన ఖరారయ్యింది. ఈ నెల 20వ తేదీన తిరుపతి జిల్లాకు రానున్నారు. రెండు రోజుల పాటు తిరుమల, తిరుపతిలో పర్యటించనున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రం 3.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.55 నుంచి 4.30 వరకూ రోడ్డు మార్గంలో తిరుచానూరు చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. సాయంత్రం 5.20 గంటలకు తిరుమల పద్మావతి అతిథిగృహం చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. 21వ తేదీ ఉదయం 9.,30 గంటలకు వరాహస్వామిని దర్శించుకుని, 10 గంటలకు శ్రీవారిని దర్శించుకుంటారు. 10.50 గంటలకు తిరుమల నుంచి బయల్దేరి 11.50 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడనుంచి హైదరాబాద్కు బయల్దేరి వెళతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆమెకు స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ 20న మధ్యాహ్నం 1 గంటకు రేణిగుంటకు చేరుకోనున్నారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు పర్యటన నేపథ్యంలో పది రోజులుగా ప్రతిరోజూ సమీక్షిస్తున్నారు. ఢిల్లీ బాంబు ఘటన నేపథ్యంలో తిరుపతిలో హైఅలర్ట్ ప్రకటించారు. తిరుపతి శివారు ప్రాంతంలో ఏడు పోలీసు ఔట్పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. తిరుమల తిరుపతిలో బందోబస్తు నిమిత్తం 1500 మంది పోలీసులు పహరా కాస్తున్నారు.

బాలాజీ డివిజన్పై మాట్లాడతాం : ఎంపీలు వేమిరెడ్డి, గురుమూర్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని రానున్న పార్లమెంటు శీతాకాల సమావేశంలో ప్రశ్నిస్తామని ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ గురుమూర్తి తెలిపారు. మంగళవారం బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పల గిరిధర్ ఆధ్వర్యంలో తిరుపతి, తిరుమల లో వారిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. తర్వాత కొవ్వూరు శాసనసభ్యురాలు ప్రశాంతి రెడ్డి ని కలసి తిరుపతిని బాలాజి డివిజన్ విషయమై రెప్రజెంటేషన్ ఇవ్వడం జరిగినది. రైల్వే డివిజన్ ఆవశ్యకత గురించి ఎంపీ అడిగిన వాటికి వివరించగా వారు సానుకూలంగా స్పందించి తనవంతు ప్రయత్నం తప్పకచేస్తానని తెలిపారు. తిరుపతి ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులును కలవగా సిఎం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. వారిని కలిసిన వారిలో తిరుపతి ఫిల్మ్ సొసైటీ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షులు వై ఎస్ బాబు, సూరినేని బుజ్జి బాబు నాయుడు, నీలేష్ కుమార్, కుమార్ పాల్గొన్నారు.







హిందూ ధార్మిక సమ్మేళనంతో ప్రసంగిస్తున్న విజయశంకర స్వామీజీ

కొండపై అన్నమయ్య ఇంటిని పునర్నిర్మించాలి : విజయ శంకర స్వామీజీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుమల కొండపై కూల్చివేసిన అన్నమయ్య గృహాన్ని, విగ్రహాన్ని, హనుమంతుని విగ్రహాన్ని పునర్నిర్మించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర్ స్వామీజీ డిమాండ్ చేశారు. అన్నమయ్య పీఠం ఆధ్వరంలో పలువురు పీఠాధిపతులతో మంగళవారం హిందూ ధార్మిక సమ్మేళనం జరిగింది. స్థానిక యశోదనగర్లోని వేమన విజ్ఞన కేంద్రం వద్ద జరిగిన సమావేశం అనంతరం పీఠాధిపతులు భక్తులతో కలిసి టీటీడీ పరిపాలన భవనం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం టిటిడి అధికారులకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయ శంకర్ స్వామీజీ మాట్లాడుతూ అన్నమయ్య కళాపీఠం ఆధ్వర్యంలో తిరుమల భక్తులు సమస్యలపై నవంబర్ 18 వ తేదీ నుండి 2026 మే రెండోవ తేదీ అన్నమయ్య జయంతి వరకు దేశవ్యాప్తంగా శాంతియుధ్యాల ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తుల సమస్యలు తెలుసుకుంటామని, ఈ కార్యక్రమంలో భక్తులు భాగ్యస్వామ్యం కావాలని సూచించారు. తిరుమల కొండపై కూల్చేసిన అన్నమయ్య గహము, అన్నమయ్య విగ్రహము, హనుమంతుని విగ్రహాన్ని పున్నర్నిర్మించాలని కోరారు. టీటీడీ అనుబంధంగా ఉన్న క్షేత్రాలలో అఖండ హరినామ సంకీర్తన చేపట్టాలని, ఆధ్యాత్మిక గురువులకు, కళాకారులకు పదివేల రూపాయలు గౌరవ వేతనంతో పాటు, బస్సు, రైళ్లల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని దేవాలయాలలో స్వామీజీలకు, మఠాధిపతులకు, పీఠాధిపతులకు, గురువులకు, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించాలని, అన్ని దేవాలయాలలో సాంస్కతిక కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. సాధువులకు సాధుభవనం, కళాకారులకు గురువులకు సాంస్కత భవనం నిర్మించాలని, మాలధారణ గురువులకు ప్రత్యేక దర్శనంతో పాటు భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా నిర్వహించే శాంతియుధ్యాల అనంతరం 2026 మే రెండోవ తేదీ తిరుపతి టీటీడీ పరిపాలన భవనం ఎదుట వేలాది మంది భక్తులతో కలిసి ధార్మిక సమ్మేళనం చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండన్న పీఠం పీఠాధిపతి లక్ష్మీపతి స్వామి, అన్నమయ్య కళాపీఠం గురు సాధన సమితి కార్యదర్శి మల్లిక వల్లభన్, అన్నమయ్య కళాపీఠం కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు రామప్ప స్వామి, ప్రధాన కార్యదర్శి శ్యామప్ప స్వామి, సాదు పరిషత్ జాతీయ అధ్యక్షులు భాగ్యేశ్వర స్వామి, అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షులు దయానంద స్వామి, ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటేష్, సానా నూకరాజు, బ్రహ్మచారి మాల్యానంద స్వామి పాల్గొన్నారు.



తిరుమల రెండో ఘాట్లో ప్రమాదం

వెండార్కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల ఘాట్ రోడ్ పై రాయి పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ వర్షాల కారణంగా మంగళవారం ఉదయం ఘాట్ రోడ్డులో ఈ ఘటన జరిగింది. కొండ పైకి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక వ్యక్తిపై కొండ పైనుంచి రాయి దొర్లుకుంటూ వచ్చి పడింది. దీంతో అతడికి తల, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన తోటి భక్తులు, వాహనదారులు వెంటనే టీటీడీ సిబ్బందికి, అంబులెన్స్కు సమాచారం ఇచ్చారు. గాయపడిన వ్యక్తిని అధికారులు తిరుమల లగేజ్ సెంటర్లో వెండార్గా పనిచేసే లోకేష్గా గుర్తించారు. మంగళవారం ఉదయం విధి నిర్వహణ కోసం బయలుదేరిన లోకేశ్, రెండో ఘాట్ రోడ్డులోని హరిణి ప్రాంతం వద్ద ప్రమాదానికి గురయ్యాడు. కొండ పైనుంచి వర్షం కారణంగా జాలువారిన రాయి అతడిపై పడటంతో, లోకేష్ బైక్ పైనుంచి కిందపడ్డాడు. అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్ ద్వారా అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. లోకేష్కు చికిత్స అందిస్తున్న వైద్యులు ప్రస్తుతం అతడు కోలుకుంటున్నాడని తెలియజేశారు.

భూసేకరణ గడువులోపు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రైల్వే ప్రాజెక్ట్ పనులు, క్రిస్ సిటీ, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి ఫేస్-1,ఫేస్-2 అంశాలపై పలు భూ సంబంధిత పెండింగ్, వైజాగ్ - చెన్నయ్ కారిడార్ పైపు లైన్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో కలెక్టర్ వర్చువల్ విధానంలో సదరన్ రైల్వేస్ సిపిఎమ్ బిఎన్ఎస్ చలం, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు, తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... తిరుపతి జిల్లాలో రైల్వే ప్రాజెక్ట్ పనులు పురోగతిలో ఉన్న పనులపై రేణిగుంట- పూడి, రేణిగుంట-గూడూరు, బాలయ్యపల్లి- వెంకటగిరి ,రేణిగుంట-శ్రీకాళహస్తి, తిరుపతి-పాకాల, సధరన్ రైల్వేస్ అరక్కోణం-రేణిగుంట, గుమ్మడిపూడి-గూడూరు సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. క్రిస్ సిటీ కి సంబంధించి భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. శ్రీ సిటీ లోని ఫేస్-1, ఫేస్-2 పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. దుగ్గరాజపట్నం సంబందించి పెండింగ్ లో ఉన్న పనులను కూడా త్వరిత గతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు, వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు బానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, తిరుపతి, రైల్వే డిప్యూటీ సి ఈ వామనమూర్తి, రైల్వే ప్రాజెక్టు ఎ. ఈ, రాధాకష్ణ, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, ఎల్. శివకుమార్, డి.ఐ.సి జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, సత్యవేడు, వాకాడు, కోట సంబంధిత తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు , భూ సేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

నేడు 'అన్నదాత సుఖీభవ' జమ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడత నగదును రైతుల ఖాతాల్లో బుధవారం జమచేయనున్నారు. తిరుపతి జిల్లాలో ఈ పథకం కింద అర్హులుగా లక్షా 54వేల మంది ఉన్నారు. వీరికి 104 కోట్ల 54 లక్షల నిధులు విడుదలయ్యాయి. నియోజకవర్గాల వారీగా ఈ నిధులను జమ చేయనున్నట్లు వ్యవసాయ జిల్లా అధికారి ప్రసాద్రావు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

పెద్దశేష, హంస వాహనాలపై విహరించిన సిరులతల్లి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజైన మంగళవారం ఉదయం ఏడు తలలు గల పెద్దశేషవాహనంపై, రాత్రి హంస వాహనం పై సిరులతల్లి పద్మావతిదేవి ఆలయ మాడవీధుల్లో విహరించారు. అశ్వాలు, వషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్కభజనల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు వాహనసేవ సాగింది. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. ఈ వాహన సేవల్లో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో మురళీకష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ హరింద్రనాథ్ పాల్గొన్నారు.

నదీహారతులకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఉత్తరవాహినిగా పేరుగాంచిన స్వర్ణముఖి నదికి హారతులు సమర్పించే కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వరాలయాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం ఏడు గంటలకు నదీహారతుల కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా కార్తీకమాసంలో వచ్చే బహుళ అమావాస్య సందర్భంగా స్వర్ణముఖి నదికి హారతులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు.

శివయ్య సేవలో రష్యన్ భక్తులు

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో రష్యన్ భక్తులు సందడి చేశారు. 40 మంది రష్యన్ భక్తుల బందం మంగళవారం ఆలయానికి రాగా అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఏర్పాట్లపై రష్యన్ భక్తులు హర్షం వ్యక్తం చేశారు.


శ్రీకాళహస్తీశ్వరాలయంలో రష్యన్ భక్తులు


ట్రస్టు ఆస్తి అప్పగింత



భవనం వద్ద మాట్లాడుతున్న జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామక్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి అర్బన్ మండలం నగర పరిధి తీర్థకట్ట వీధిలో శ్రీ కందాల గోవిందాచార్యుల ట్రస్టుకు సంబంధించిన 7060 చదరపు అడుగుల భవన సముదాయాన్ని ఆక్రమణదారుల నుండి హైకోర్టు ఉత్తర్వుల మేరకు రక్షించి ట్రస్ట్ కార్యనిర్వహణాధికారికి అప్ప చెప్పినట్లు జిల్లా దేవాదాయ శాఖ అధికారి పి.రామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ట్రస్టుకు సంబంధించిన ఈ భవనాన్ని ఆక్రమణదారులు స్వాధీన పరచుకోవాలనే దురుద్దేశంతో వివిధ కార్యకలాపాలను సాగించారని, ఈనెల 14న హైకోర్టు వారు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు తీర్థకట్ట వీధిలోని డోర్ నెంబర్ 157, 158 గల స్థలంలో ఉన్న భవనాలను దురాక్రమణదారుల నుండి గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పోలీసులు, విద్యుత్తు శాఖ సహకారంతో ట్రస్టు కార్యనిర్వహణాధికారికి అప్పగించి, హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశామన్నారు.

గ్రాప్లింగ్‌లో ఎస్పిడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ



ప్రజాశక్తి - క్యాంపస్ : బెంగళూరు సిటీ యూనివర్సిటీలో నవంబర్ 7 నుంచి 9వరకు జరిగిన ఘట్కా క్రీడలో హెచ్ఈసి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ధాత్రి మొగధారమ్మ, (కత్తిసాము), నవంబర్ 1నుంచి 3వరకు ఉత్తరప్రదేశ్‌లోని నందిని నగర్ కళాశాలలో జరిగిన గ్రాప్లింగ్ క్రీడల్లో ఎమ్ఈసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న భావన ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎస్పిడబ్ల్యూ విద్యార్థినిలు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచి రాణించడం కళాశాలకు, టిటిడి సంస్థకు గర్వకారణమని, ఘట్కా అనే క్రీడ, యుద్ధ కళ అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని అభినందించారు.

మయూరి శ్యామ్‌కు విశ్వం వరల్డ్ రికార్డ్ అవార్డు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రముఖ సామాజికవేత్త, సేవా దృక్పరుడు డాక్టర్ బండి శ్యామసుందరరావు(మయూరి శ్యామ్ యాదవ్) మరొక అరుదైన రికార్డ్ సాధించారు. ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాల కుగాను "విశ్వం వరల్డ్ రికార్డ్" అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ నాకు ఈ అవార్డు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి



సచివాలయాల సిబ్బందితో సమీక్షిస్తున్న జిఎస్ డబ్ల్యుఎస్ జిల్లా అధికారి నారాయణరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడానికి సిబ్బంది సంసిద్ధతతో పనిచేయాలని గ్రామ వార్డు సచివాలయాల జిల్లా అధికారి జివి నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని చెన్నారెడ్డి కాలనీ, ఎస్టి రోడ్డులో గల వార్డు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ప్రజలకు అందిస్తున్న సేవలను, కౌశలం పెండింగ్ కేసులు, ఈకేవైసీ, మాండెటరీ బయోమెట్రిక్ నమోదు, హబ్ వివరాల అప్డేషన్, పాన్ అప్డేషన్ తదితర గ్రామ సచివాలయం, వార్డు సచివాలయ కార్యకలాపాలపై సిబ్బందితో చర్చించారు. సమీక్షలో కొన్ని సేవలు అమలులో సిబ్బంది అలసత్వం వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసి, పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల సమాచారం కచ్చితత్వంతో నమోదు చేయాలని, రోజువారి డేటాను సకాలంలో అప్డేట్ చేయడం చేయాలన్నారు.

పరిశుభ్రత, పచ్చదనంపై సర్పంచ్‌లకు శిక్షణ



ప్రజాశక్తి - బాలాయపల్లి : స్థానిక సచివాలయంలో మంగళవారం పరిశుభ్రత, పచ్చదనం థీమ్ 5 పై ఎంపీ డీఓ నారాయణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలల్లో పారిశుద్యం మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. అదే క్రమంలో థీమ్ 5 పై కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, పచ్చదనంపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ, కార్యాలయం ఏవో వినీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్‌లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా పర్యావరణ హితం, సాలిడ్, లిక్విడ్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, రీసైక్లింగ్ ఎలా చేస్తారో వివరించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటరత్నమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ రాజేష్‌లు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ చిరంజీవి, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్లు థీమ్-5పై శిఓణ ఇచ్చారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక





ప్రజాశక్తి - వరదయ్యపాలెం: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) వరదయ్యపాలెం మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర జిల్లా నాయకులు యువశ్రీ మురళి, పోలూరు జగన్నాధం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా మల్లం మోహిద్దీన్, అధ్యక్షుడుగా పూడి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా పామంజి సూరిబాబు, ఆర్థిక కార్యదర్శిగా మల్లం ముజీబ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రంగనాథ్ చిన గురవయ్య, మోహన్ రావు, సుబ్బరామయ్య, కార్యదర్శులుగా పరంధామయ్య, స్వామిదాస్, పల్లిపట్టు నాగరాజు, గోకులక్రిష్ణ, రవిబాబు, అప్పారావు మనోజ్, ఆర్థిక కమిటీ సభ్యులుగా శ్రీనివాసరావు, లోకేష్, సుగుణ, శ్రీకర్, మహిళా కన్వీనర్‌గా వసంత, సిపిఎస్ కన్వీనర్‌గా శివ, మహిళా సభ్యులుగా సురేఖ, సుమ, సౌమ్య, జిల్లా కౌన్సెలర్లుగా వెంపళ్ల చిన్నయ్య, చెంగయ్య, శ్యామసుందర్, మోతిలాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో ప్రజా దర్బార్



ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండల పరిధిలోని తహశీల్దార్ కార్యాలయంలో రైతుల భూ సమస్యల పరిష్కారానికి మంగళవారం ప్రజా దర్బార్ కార్యక్రమం ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు అర్జీలు సమర్పించారు. భూ సమస్యలపై ఆర్టిక రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులు అర్జీ దారులకు న్యాయం చేయాలని సూచించారు. భూ సమస్యలపై ప్రజలు ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. రెవెన్యూ సమస్యతో వచ్చిన ప్రతి అర్జీదారునికి రసీదులు ఇచ్చి నెల రోజుల్లో పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశించారు. మండల వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలపై 250 అర్జీలు వచ్చాయని వెంటనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పరమేశ్వర స్వామి, ఎంపీడీవో, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రింగు రోడ్డు ఏర్పాటుకు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎగువ గుశూరు దళితులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, తడుకు పంచాయతీ, తడుకు నుంచి చెరుకు రాజుపాలెం వరకు రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని, విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయాలని, ఎగువ గుశూరు దళితులు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య మాట్లాడుతూ ఐదు కిలోమీటర్ల తారు రోడ్డు గుంతల మయమయిందని, చిన్నపాటి వర్షానికి కూడా రోడ్డుపై నీళ్లు నిలిచిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తమ వినతిపై స్పందించిన కలెక్టర్ రింగు రోడ్డు, విద్యుత్ లైట్లు ఏర్పాటుకు అధికారులతో చర్చించి, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వి.సునీల్, వై.మురగయ్య, బి.విజయ, టి.అభిషేక్, కె. రుకేష్, వి.లవ కుమార్, ఏ.జాలీ, బి.మాధవి, వి.నాగార్జున, టి.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో గ్రామాభివృద్ధి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కురుగొండ ధనలక్ష్మి

ప్రజాశక్తి - నాయుడుపేట : గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషి ముఖ్యమని నాయుడుపేట ఎంపీడీవో కురుగొండ ధనలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలని సూచించారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రూపొందించి, ఆలయాలు, పాఠశాలల్లో మొక్కల పెంపకం చేపట్టి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకొని సమన్వయంతో పని చేసి అభివృద్ధి సాధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిడిఓ జాలిరెడ్డి, ఎంపీడీఓ కె.సురేష్ బాబు, పలువురు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది హాజరు తప్పనిసరి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సచివాలయ కార్యదర్శులు ప్రతి రోజూ హాజరు నమోదు తప్పక చేయాలని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నగరంలోని కెనడి నగర్ లోని 12, 13 వార్డు సచివాలయాలను, డి అడిక్షన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సచివాలయాల్లో సిబ్బంది హాజరు నమోదును పరిశీలించారు. ప్రజల వద్ద నుండి ఏలాంటి వినతులు వస్తున్నాయని తెలుసుకున్నారు. హాజరు నమోదు, కార్యాలయం విధుల రిజిస్టర్‌ను పరిశీలించారు. డి అడిక్షన్ సెంటర్ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అన్ని విభాగాల కార్యదర్శులు ఖచ్చితంగా హాజరు నమోదు చేయాలని తెలిపారు. ఏప్రాన్ ఫేస్ కి వెళ్లా మూమెంట్ రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సచివాలయ కార్యదర్శులు, డి అడిక్షన్ సెంటర్ సిబ్బంది ఉన్నారు.

'సమానత్వం - ఆత్మ గౌరవ' పోరాటం : సిపిఐ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: దేశంలో సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మ గౌరవం కోసం దేశ వ్యాపిత ఆందోళనలు చేయాలని సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా, తిరుపతిలో గాంధీ విగ్రహం వద్ద నుండి అంబేద్కర్ విగ్రహం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ అధికారం చేపట్టినప్పటినుండి గత 11 ఏళ్ళ కాలంలో దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలపై దాడులు మితిమీరిపోతున్నాయని, దేశంలో మతోన్మాద పాలన సాగుతోందన్నారు. అణిచివేత, అంటరానితనం, కుల, మత విద్వేష, హింస పెట్రేగిపోతున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ శక్తుల కనుసన్నల్లో భారత రాజ్యాంగం, లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తున్నారన్నారు. గిరిజనుల పొట్టకొట్టేలా, అడవిభూమి హక్కులను హరించేలా, ఆదానీ, అంబానీలకు అప్పజెప్పేందుకు దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, నగర కార్యదర్శి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి కార్పొరేషన్ డిసిపి మహబూబ్ ఖాన్ బదిలీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ సిటీ ప్లానింగ్ అధికారి మహబూబ్ ఖాన్‌ను ప్రభుత్వ బదిలీ చేస్తూ మునిసిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ జిల్లా ప్లానింగ్ అధికారిగా బదిలీ అయ్యారు. ఏడు నెలల క్రితం తిరుపతి కార్పొరేషన్ డీసీపీగా మహబూబ్‌ఖాన్ బాధ్యతలు చేపట్టారు. వచ్చిన నెల్లో రావడంతో ఆయన ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ జిల్లా ప్లానింగ్ అధికారిగా వెళ్తున్నారు.

ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షులుగా పవన్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షులుగా వంకిపురం పవన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్ లో ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, తిరుపతి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా అధ్యక్షులుగా రెండోసారి ఎన్నికైన వంకిపురం పవన్ ను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వంకిపురం పవన్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు పదవీ విరమణ చేసాక వారికి జరుగుతున్న నష్టాన్ని తెలుసుకుంటున్నారని, చాలీచాలని పెన్షన్ తో వచ్చేవారు జీవించి బతుకు తెరువు కోసం వెతుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జరుగుతున్న నష్టాన్ని గుర్తించి చైతన్యంతో సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగులు కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బీర్ల కిరణ్, ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షులు మధు బాబు, ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర నాయకత్వానికి, సీపీఎస్ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పరకామణి చోరీ కేసులో నిందితులకు శిక్షతప్పదు : ఎమ్మెల్యే ఆరణి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పరకామణి చోరీ కేసులో నిందితులకు శిక్ష తప్పదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలియజేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరకామణి చోరీని బయటపెట్టిన మాజీ ఏవీఎస్ఓ సతీష్ కుమార్, సీఐడీ విచారణకు వస్తూ అనుమానాస్పదంగా మృతి చెందటం బాధాకరమన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరక ముందే మాజీ టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సతీష్ కుమార్‌ది ఆత్మహత్య అని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. తన పేరు చెప్పమని సతీష్ కుమార్‌పై అధికారులు ఒత్తిడి తెచ్చారని, సతీష్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారని కరుణాకర్ రెడ్డి చెప్పారు, మరి సతీష్ కుమార్‌ది ఆత్మహత్య కాదు, హత్యగా అధికారులు అభిప్రాయ పడుతున్నారని అన్నారు. కరుణాకర్ రెడ్డి గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్టు వ్యవహరించారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ టిటిడి చైర్మన్ అయిన కరుణాకర్ రెడ్డికి తెలియకుండా తిరుమలలో ఏ విషయం జరగదన్నారు. సతీష్ కుమార్ మృతిపై సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ విచారణ చేస్తున్నారు. సతీష్ కుమార్ హత్యకు కారకులు, పరకామణి చోరీ కేసులో నిందితులకు శిక్ష తప్పదని హెచ్చరించారు.

అలిషా దర్గాలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఈదులగుంటలోని మస్తాన్ బాబా అలీషా దర్గాలో మంగళవారం గంధోత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ మైనార్టీ విభాగం నాయకులు షాకీర్ అలీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం దర్గా సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. షఫీ, దౌలాబాబు, ఎన్టార్ జహీర్ అహ్మద్, మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పిల్లల ఆధార్ అప్డేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిఎస్ డబ్ల్యూఎస్ జిల్లా అధికారి నారాయణరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామని, తిరుపతి జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల ఆధార్ అప్డేషన్, బయోమెట్రిక్ వంటివి అప్డేట్ చేసుకోవడానికి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి జీవి నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లాలో అక్టోబర్ నెలలో నిర్వహించిన ఆధార ప్రత్యేక శిబిరాల కొనసాగింపుగా గ్రామ వార్డు సచివాలయ విభాగం పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. తిరుపతి జిల్లాలో మొత్తం 86,141 మంది పిల్లలు ఉన్నారని, ప్రత్యేక ఆధార్ శిబిరాల ద్వారా ఆధార్ బయోమెట్రిక్ చేసుకున్నవారు 4139 మంది విద్యార్థులు మాత్రమే బయోమెట్రిక్ అప్డేట్ చేసుకున్నారని, మిగిలినవారు బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోలేదన్నారు. భారతీయ విద్యా భవన్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని నారాయణరెడ్డి సందర్శించారు. ఈనెల 17వ తేదీ నుండి 26వ తేదీ వరకు విద్యార్థుల కోసం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర సూచనల మేరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసామన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన .. కాలేజీల వద్ద పోలీసుల పర్యవేక్షణ



ప్రజాశక్తి - చంద్రగిరి: ప్రజాశక్తిలో ప్రచురితమైన "చంద్రగిరిలో స్వర్ణ ముఖినదిలో లిక్విడ్ గంజాయి కలకలం" వార్తకు స్పందించిన స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. చంద్రగిరిలో ఇటీవల కాలేజీ వద్ద యువకులు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నారని పిర్యాదులు రావడంతో అలెర్ట్ అయిన పోలీసులు కాలేజీ వదిలే సమయంలో కాలేజీ వద్ద పర్యవేక్షస్తున్నారు. రెండు రోజుల క్రితం చంద్రగిరిలో లిక్విడ్ గంజాయి లభ్యమవడంతో చంద్రగిరి శివారు ప్రాంతాల్లో, హాస్టల్ సమీపంలో ఉన్న అరకొర సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. తరుచు కాలేజీల వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తారా లేదా సంఘటన ఏదైనా జరిగిన రెండు రోజులకు స్పందించి తరువాత పట్టించుకుంటారా లేదా వేచించుడాలని స్థానికులు తెలిపారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో పిల్లలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కేవీబి పురం: కేవీబి పురం, కళత్తూరు వరద ముంపు బాధిత పిల్లలకు దుస్తులు, పాఠశాలకు బీరువా, అవసరమైన వస్తువులను ఎంఈఓ రవికుమార్ చేతుల మీదుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, యుటిఎఫ్ జిల్లా పూర్వ సహాయ అధ్యక్షుడు కెఎస్‌బి సూర్య ప్రకాష్, జిల్లా కార్యదర్శి అక్కుపల్లి హేమంత్ కుమార్‌లు మాట్లాడుతూ కళత్తూరులో జరిగిన వరద బీభత్సంతో సర్వస్వం కోల్పోయిన విద్యార్థులకు యుటిఎఫ్ ఉపాధ్యాయులు తమ వంతు సహాయంగా విద్యార్థులకు దుస్తులు, పాఠశాలకు కావాల్సిన వస్తువులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హేచ్‌ఎం కున్నటి సురేష్, రాగిగుంట హైస్కూల్ హెచ్‌ఎం వెంకట కృష్ణయ్య, సిఆర్‌పి, సూపర్, ఆనందుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలో పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - వాకాడు: గూడూరు డి.డి.ఓ వాణి రెడ్డి మంగళవారం మండల కేంద్రంలోని దళితి వాడను తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేస్తే అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉన్న దృష్ట్యా డి.డి.ఓ ఆ పనులు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీ కార్యదర్శి, తదితర సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో డిడిఓతో కూడా డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకోసం యత్నిస్తే కఠిన చర్యలు : సిఐ సురేష్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలంలో ఆకతాయి పోకడలతో ఎవరైనా మత్తుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రగిరి సిఐ సురేష్ కుమార్ హెచ్చరించారు. గత కొన్నేళ్లుగా చంద్రగిరి మండలంలో కొంత మంది మత్తుకోసం పెడదోవపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఎవరైనా గంజాయి కలిగి వుండటం, వినియోగించడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమన్నారు. మత్తుకు బానిసలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు.

సామాజిక న్యాయం అందించాలి

ప్రజాశక్తి-వెంకటగిరి: దేశంలో అందరికీ సామాజిక న్యాయం సమానత్వ సాధన, ఆత్మగౌరవం అందించాలని, జన గణనలో కుల గణన చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వెంకటగిరి మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు నిరసన ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటగిరి నియోజకవర్గ బాధ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తదుపరి 11 ఏళ్ల కాలంలో దళిత, గిరిజన, మహిళా, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలపై దాడులు మితిమీరి పోతున్నాయన్నారు. నియోజకవర్గ కార్యదర్శి బాలకృష్ణ, నియోజకవర్గ జిల్లా సహాయకులు కత్తి రవి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గం, చంద్రగిరి పట్టణం టవర్ క్లాక్ వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, మండల కార్యదర్శి ఎన్.శ్రీరాములు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గిరిజన, దళిత, బిసి, మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయని ఆదేదన వ్యక్తం చేశారు. చంద్రగిరి పట్టణంలో గంజాయి విపరీతంగా పెరిగిందని, కట్టడి చేయడంలో స్థానిక అధికారులు విఫలం చెందుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల సమితి సభ్యులు కేవైరాజా, పార్వతి, గీత, రవిచంద్ర, రవి, ముని రాజా, పింటూ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వతో స్థిరాస్తి హక్కుల కల్పన

ప్రజాశక్తి - రామచంద్రాపురం : స్వామిత్వతో గ్రామీణులకు స్థిరాస్తి హక్కు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి రైతు విభాగం అధ్యక్షుడు పూజారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సొరకాయల పాల్యం గ్రామ సచివాలయం వద్ద స్వామిత్వపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస స్థలాలలో పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, ఆస్తి యాజమాన్యం ధ్రువపత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ స్వామిత్వ ద్వారా పొందే స్థిరాస్తి కార్డుల ద్వారా ఆస్తిపై సర్వ హక్కులు వస్తాయని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు కాయం చంద్రబాబు యాదవ్ మాట్లాడుతూ స్వామిత్వ సర్వే నిర్వహణ బాగుందన్నారు. 250 మంది లబ్ధిదారులను స్థిరాస్తి కార్డులకు ఎంపిక చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ తెలియజేశారు. గ్రామ సభలో పదిమంది ఉమ్మడి కుటుంబానికి చెందిన లబ్ధిదారులు అభ్యంతరాలు తెలియజేశారని, రెవెన్యూ సర్వే అధికారులతో కలసి విచారణ చేసి పరిష్కరించి, పిపిఎం కార్డ్స్ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రమ్య, గౌతమ్, పురుషోత్తం, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, కొండూరు సచివాలయంలో మంగళవారం స్వామిత్వ ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సాయి ప్రసాద్ మాట్లాడుతూ కొండూరు గ్రామ సచివాలయం పరిధిలో మొత్తం 181 మంది స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి, సంతకాలు తీసుకున్నామని తెలిపారు. స్వామిత్వ కార్యక్రమం ద్వారా పేదవారికి ఉచితంగా ఇంటి పట్టాలు జారీచేయడం జరుగుతుందన్నారు. వాకాడు మండల తెదేపా అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత వాకాడు మండలం కొండూరు సచివాలయం పరిధిలో నూరు శాతం స్వామిత్వ రీసర్వే పూర్తిచేసి వారి స్థలాలకు విలువని చేకూర్చడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు డి.డి.ఓ వాణి రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, పంచాయతీ కార్యదర్శి శివకుమారి, టి.డి.పి వాకాడు మండలాధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కొండూరు సచివాలయ పరిధిలో ఉన్న మండల ప్రజా పరిషత్ ఎలిమెంటరీ స్కూల్‌ని సందర్శించారు. రిజిస్టర్లు, భోజన పథకాన్ని పరిశీలించారు.

వర్షాలకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండలంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ వసతులపై ప్రభావం చూపాయి. తాజాగా నిర్మించిన 33 కెవి సబ్‌స్టేషన్ నుండి వెస్ట్ వర్తురు సబ్‌స్టేషన్ మధ్య ఏర్పాటు చేసిన కొత్త విద్యుత్ లైను వర్షానికి దెబ్బతినింది. శ్రీకాళహస్తి, తడ ప్రధాన రహదారి కారణి మిట్ట మలుపు వద్ద నూతన విద్యుత్ తీగల స్తంభాల్లో నాలుగు స్తంభాలు నేలకొరిగి పక్కనే ఉన్న వ్యవసాయ భూములపై కూలిపోయాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణాపాయం జరగకపోయినా రైతుల పంటలకు స్వల్ప నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలు లైన్ల పునర్నిర్మాణానికి అత్యవసర పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

'గాలి' కుటుంబానికి ప్రాధాన్యత ఇస్తాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గాలి కుటుంబానికి టిడిపిలో తగిన ప్రాధాన్యతనిస్తామని ఆ పార్టీ జోనల్ ఏరియా కో-ఆర్డినేటర్ దీపక్ రెడ్డి హామీ ఇచ్చారు. తొట్టంబేడు మండల టిడిపి మాజీ అధ్యక్షులు గాలి మురళీ నాయుడు మంగళవారం రేణిగుంటలో దీపక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో గాలి, పోతుగుంట కుటుంబాలు పోషించిన పాత్రను ఆయన వివరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో, ముఖ్యంగా తొట్టంబేడు మండలంలో టిడిపి కంచుకోటగా మారడానికి తమ రెండు కుటుంబాలు ఎంత కష్టపడ్డాయో అందరికీ తెలుసన్నారు. అనంతరం బయోడేటాను దీపక్ రెడ్డికి అందజేశారు. అంకయ్య చౌదరి, రాఘవులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లిని మోడల్‌గా తీర్చి దిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి - బాలాయపల్లి : బాలాయపల్లి మండలాన్ని మోడల్ మండలంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని వెలుగు ఏపీఎం కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యలయంలో మంగళవారం సంఘమిత్ర సభ్యులు, విఓఎలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపియం కిరణ్ మాట్లాడుతూ మోడల్ మండలంగా తీర్చి దిద్దేందుకు చేపట్టవలసిన అంశాలు ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, సుస్థిర జీవనోపాదులపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో వార్షిక ప్రణాళికలు రూపొందించి తద్వారా గ్రామాల అభివృద్ధి, మండల సమాఖ్య అభివృద్ధి ప్రణాళికలతో రోబోయే ఐదేళ్ల మండలాన్ని మోడల్ మండలంగా తీర్చి దిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణాధికారి చెంగల రాయులు, ఎల్ సి సీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి - నాయుడుపేట : అమ్మాయిని బ్లాక్ మెయిల్ చేసి హింసించిన కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష పడిన సంఘటన నాయుడుపేటలో చోటుచేసుకుంది. ఒక విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆటోలో ఎక్కించుకొని ముద్దు పెట్టి, ఆమెకు తెలియకుండా ఫోటోలు తీసి, కోరిక తీర్చకపోతే సోషల్ మీడియాలో పెడతానని బెదిరించిన ఓ వ్యక్తికి మూడేళ్ళ జైలు శిక్ష పడినట్లు నాయుడుపేట పోలీసులు తెలిపారు. నాయుడుపేట మండలం, వేమగుంటపాలెం గ్రామానికి చెందిన బల్లి శంకరయ్య కుమారుడు, బల్లి మల్లికార్జున ఓ విద్యార్థినిని వేధించినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం కోర్టులో కేసు రుజువు కావడంతో న్యాయమూర్తి ముద్దాయి మల్లికార్జునకు మూడేళ్ల జైలు శిక్ష, 2000 రూపాయలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌బిఆర్ పురం చెరువును సందర్శించిన కలెక్టర్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వడమాలపేట మండల పరిధిలోని ఎస్‌బిఆర్ పురం గ్రామ చెరువు సమస్యపై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను రైతులు, గ్రామస్తులు కలిసి పరిష్కారం చూపాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ముంపుకు గురైన పట్టా భూముల రైతులకు, ఆయకట్టుదారులకు తగు న్యాయం చేసి, సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. కలెక్టర్ మంగళవారం ఆ గ్రామ చెరువును సందర్శించి, తూములు, కలుజు నీటిలో మునిగిన విద్యుత్ స్తంభాలు, మోటార్లు, ఇండ్లు, పంట భూములను పరిశీలించారు. రెండు, మూడు నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు 48 ఎకరాల విస్తీర్ణంలో (గుశూరు) ఎస్‌బిఆర్ పురం గ్రామచెరువు- 450 ఎకరాల పైచిలుకు ఆయకట్టు ప్రాంతం ఉందని, 20 ఏళ్లుగా వర్షాలప్పుడే ఎస్.బి.ఆర్ పురం రైతుల భూములు ముంపుకు గురవుతున్నాయని, సుమారు 360 ఎకరాల పంట భూములు శాశ్వత ముంపులో-సాగు చేయలేని పరిస్థితిలో ఉన్నాయని కలెక్టర్‌కు తెలిపారు. ఇళ్లలోకి నీరు వచ్చేస్తోందని, చేపలు పట్టడంలో కూడా ఇబ్బంది ఎదుర్కొంటున్నామని మత్స్యకారులు తెలిపారు. చెరువు రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ మణిరాజు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

స్వమాక్స్ ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి స్వమాక్స్ కార్యాలయంలో స్వర్ణముఖీ మహిళా పరస్పర సహకార సంఘం (స్వమాక్స్), సబ్ డివిజనల్ సహకారశాఖల ఆధ్వర్యంలో మంగళవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం స్వమాక్స్ పాలక వర్గ సభ్యురాలు బి.పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజనల్ అధికారి టి.రవిబాబు మాట్లాడుతూ సహకార వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్, సునీల్ దత్‌లు మాట్లాడుతూ ఆర్థిక కార్యక్రమాలతో బాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వమాక్స్ సీఈఓ ఎస్.విశ్వనాథ్ మాట్లాడుతూ సభ్యుల ఆర్థిక, సామాజిక, ఇతర శిక్షణా కార్యక్రమాలు, సభ్యుల పిల్లలు విద్యా ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్వమాక్స్ సభ్యులు, సహకార సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ శ్రీవల్లి, బాషా, సుబ్రమణ్యం, స్వమాక్స్ సిబ్బంది, పి.సుబ్రమణ్యం, యం.రవి, యుగంధర్, అంజప్ప, వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గున్నారు.

రైతులకు యూరియా పంపిణీ



ప్రజాశక్తి - వాకాడు : తిరుపతి జిల్లా, వాకాడు మండలం, జెమిని కొత్తపాలెం సచివాలయ పరిధిలోని గంగన్న పాలెంలో టిడిపి సీనియర్ నాయకులు, వాకాడు సొసైటీ డైరెక్టర్ తిరుమూరు వెంకటకృష్ణారెడ్డి చేతుల మీదగా రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ సహకారంతో, కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని, సబ్సిడీ రేటుకి యూరియా అందేల ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడడం లక్ష్యమని వారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు సురేష్ బాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని అంతం చేద్దాం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 17 నుండి 30వ తేదీవరకు నిర్వహించే కుష్టు వ్యాధి నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిని తరిమికొడదాం అనే నినాదంతో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పర్యవేక్షించనున్నారు. కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించి, సమస్య ఉన్నవారికి ఆర్యోగ కేంద్రంలో పరీక్షలు నిర్వహించి, లెప్రసీ నిర్ధారణ అయితే తగు వైద్యం అందించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశులు, ఆరోగ్య సిబ్బంది పల్లమాల ఉన్నత పాఠశాలలో పిల్లలకు కుష్టి వ్యాధి పట్ల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -కోట : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోట మండలం, కోట క్రాస్ రోడ్డులో వైసీపీ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నాయకులు పాముల సురేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి -కోట : కోటి సంతకాల సేకరణలో భాగంగా కోట మండలం నుండి పది వేల సంతకాలు సేకరించి ఉమ్మడి నెల్లూరు జిల్లా



ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ ఇంచార్జి మేరిగ మురళీధర్‌కి అందజేయడం జరిగిందని వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, సాయిప్రసాద్ రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట మండల అధ్యక్షులు పలగాటి సంపత్ రెడ్డి, చిట్టమూరు మండల సీనియర్ నాయకులు పేట రాజీవ్ రామీ రెడ్డి, గూడూరు నియోజకవర్గ నాయకులు సాయి ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ నాగరాజు, కోట మండల కమిటీ సభ్యులు పాముల సురేంద్ర, శ్రీరామ్ సురేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పురపాలక సంఘం, ఆర్టీసీ కాలనీ, కళ్యాణపురం, ఆరేటమ్మ కాలనీ, వార్డు సచివాలయాలను కమిషనర్ నాగేశ్వరరావు మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయాల పని వేళలల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుండాలని, బయో మెట్రిక్ అటెండెన్స్ వేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సిటిజన్స్ ఈ కేవైసీ, కౌశలం సర్వేలు పూర్తి చేయాలని ఆదేశించాఉరు. ప్రభుత్వ పథకాలు ప్రజాలకు చేరవేయుటలో ఆలసత్వం తగదని తెలిపారు. విరుద్ధాంగా ఎవరైనా వ్యవహరిస్తే క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిరుపతిలో కుంభవృష్టి

■ అన్ని రోడ్లు చెరువులే ■ రోడ్లపై ఏరులై పారుతున్న చెత్తా చెదారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున నుంచి పలు మండలాల్లో అల్పపీడనం ప్రభావంలో వర్షాలు కురుస్తున్నాయి. వర్షంతో పాటు చలుగాలులు వీచడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. అత్యవసరం ఉంటే తప్ప ప్రజలు వర్షంలో తడవకుండా జాగ్రత్తలు చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ముసురు పట్టి వర్షం కురిసింది. సాయంత్రం నుంచి కుంభవృష్టి కురవడంతో నగరంలో దాదాపు 90 శాతం రోడ్లు చెరువులను తలపించాయి. ఏ రోడ్డు చూసినా వర్షపు నీటితో వరదలా ప్రవహిస్తూ ఉండడమే కాక, మురుగు కాలువలు పొంగి ప్రవహించడంతో చెత్తా చెదారాం రోడ్లపైకి తేలింది. డిఆర్ మహల్ అండర్ గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి వద్ద భారీ ఎత్తున వర్షం నీరు చేరడంతో నగరపాలక ఇంజనీరింగ్ అధికారులు మోటర్లు పెట్టి పంపింగ్‌చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అక్కడ వాహనాలు రాకపోకలు నిలిపివేశారు. లక్ష్మీపురం సర్కిల్లో ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తూ ఉండడంతో పోలీసులు ముందు జాగ్రత్తగా ఈ రోడ్డును భార్యకేడ్లు పెట్టి మూసివేశారు. వెస్ట్ చర్చ్ రైల్వే గేట్ వద్ద కూడా భారీగా వర్షం నీరు చేరింది. దీంతో రాకపోకలకు త్రీవ అంతరాయం కలిగింది. ఇందిరా ప్రియదర్శని కూరగాయల మార్కెట్లో ఫుట్పాత్ మీద వ్యాపారం చేసుకునేవారు ఇబ్బందులు పడ్డారు. ఫుట్పాత్ మీద ఉండే కూరగాయలన్నీ వర్షంలో కొట్టుకుపోయాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా శివ జ్యోతి నగర్, ఎర్రమెట్ట, పోస్టల్ కాలనీ కపిల తీర్థం వద్ద వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. రాత్రి పూట కావడంతో సహాయ చర్యలు చేపట్టడానికి మున్సిపల్ ఆరోగ్యశాఖ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నప్పటికీ చెత్తాచెదారం రోడ్లపైకి ఉండకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. బుధవారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

పాలియేటివ్ కేర్‌పై ఓరియంటేషన్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ బ్యూరో, యస్విఆర్ఆర్ హాస్పిటల్ తిరుపతిలోని పాలియేటివ్ కేర్, శిక్షణా కేంద్రంతో కలిసి పాలియేటివ్ కేర్ పై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, పాలియేటివ్ కేర్ గురించి వివరించారు. తిరుపతిలోని యస్విఆర్ఆర్జెనెల్ హాస్పిటల్ ప్రొఫెసర్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రోజా రమణి, వ్యక్తిగత జీవితంలో ప్రస్తుత పరిస్థితిలో పాలియేటివ్ కేర్ యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. తిరుపతిలోని రుయా హాస్పిటల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, దీర్ఘకాలిక రోగుల జీవితాల సుఖాంతం కోసం కుటుంబం ఎలా దోహదపడుతుందో వివరించారు. తిరుపతిలోని రోటరీ క్లబ్ కోశాధికారి డాక్టర్ నాగేంద్ర, స్వచ్ఛంద సేవకుల సామాజిక బాధ్యత ఆవశ్యకత గురించి వివరించారు. డాక్టర్ దామోదరం, రోటరేరియన్ అండ్ చైర్మన్, తిరుపతిలోని హ్యూమన్ మిల్క్ బ్యాంక్, ముఖ్యంగా అవసరమైన వారికి స్వచ్ఛందంగా సేవ చేయడంలో సామాజిక సేవ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రొఫెసర్ లలిత కుమారి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డాక్టర్ మాధవి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ అనిత, ఆధ్యపకులు పరిశోధనా విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -ఏర్పేడు : బాలల రక్షణ, భాగస్వామ్యం, సమాజంలో బాలల హక్కులపై అవగాహన పెంపొందిం చడం అవసరమని ప్రగతి సంస్థ కోఆర్డినేటర్లు గుండ్లపల్లి శిరీష, నారాయణలు పేర్కొన్నారు. ఏర్పేడు మండలం, బండారుపల్లి, మునగల పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సార్వత్రిక బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలు ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ కోఆర్డినేటర్లు మాట్లాడుతూ ఈనెల 14 నుండి 20 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా అవగాహన ర్యాలీలు, పాఠశాలల్లో సెన్సిటైజేషన్ సెషన్లు, బాల స్నేహపూర్వక సమావేశాలు, పోస్టర్ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాల్య వివాహం, బాల కార్మికులు, అక్రమ రవాణా, విద్యా హక్కు, భద్రత వంటి అంశాలపై విస్తృత కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సిబ్బంది, ఆర్గనైజర్ మురగయ్య, సుభాష్ చంద్రయ్య, వెంకటేష్, రాజేశ్వరమ్మ, సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ శిక్షణ

ప్రజాశక్తి -కోట : కోట మండలం, మండల సమాఖ్య కార్యాలయంలో మూడు రోజుల మోడల్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఏపీఎం అనీలా తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఏపిఎమ్, సిసి, అకౌంటెంట్‌లు, ఐదు మండలాల మండల సమాఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఈ శిక్షణలో యాన్యువల్ యాక్షన్ ప్లాన్‌లు తయారు చేయటం, దీనిలో ఆరోగ్యం-హాస్పిటల్లో కాన్పులు, విద్య, సామాజిక భద్రత అంశాలు, ఆస్తుల సృష్టి, సుస్థిర జీవనోపాధి కార్యక్రమాలు, శక్తి సామర్థ్యాల పెంపు, ప్రవర్తనలో మార్పు ఇతర అంశాలు, ప్రభుత్వ పథకాల అమలు గురించి, పశు పోషణ, వ్యవసాయం, సామాజిక భద్రత, కుటీర పరిశ్రమల ఏర్పాటు గురించి, ప్రజలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏపీఎం అనీలా, సీసీ ప్రసాద్, భాస్కర్, శంకరయ్య, అలివేలమ్మ, అకౌంటెంట్ హిమబిందు, సంఘ బంధాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో పోటీలు



ప్రజాశక్తి - పాకాల : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు పాకాల, గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, వకృతపు పోటీలు, క్విజ్, పద్య, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్ కాలేజీ విద్యార్థులు 55 మంది పాల్గోనగా, పాకాల గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థులు 110 మంది పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు, హెల్త్ డిపార్ట్మెంట్ ఆనంద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్రంథాలయ వార్షికోత్సవాల్లో భాగంగా, పుత్తూరు శాఖ గ్రంధాలయం ఆధ్వర్యంలో మంగళవారం, గ్రంథాలయం అధికారి మీనా కుమారి, విద్యార్థులకు, వ్యాస రచన, వకృత్వ పోటీలు, డ్రాయింగ్, వంటి పోటీలు నిర్వహించారు. పుత్తూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, మెయిన్ స్కూల్, కాపు వీధి స్కూల్, వంటి పాఠశాల విద్యార్థులకు. పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి ఆర్‌విఆర్‌ఎస్ఎస్ శర్మ పోటీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సదస్సును విజయవంతం చేయండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గంలో రైతులకు రెండవ విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు జమ కార్యక్రమం బుధవారం, రాయలచెరువుకట్ట సమీపంలోని శ్రీ ముత్యాలమ్మ గుడి ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావులు పాల్గొంటారని మండల టీడీపీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి తెలిపారు. నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతులు, కూటమి నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నగదు జమ కార్యక్రమం బుధవారం సత్యవేడు వ్యవసాశాఖ ఏడిఎ కార్యాలయం వద్ద అగ్రికల్చర్ ఇన్పుట్స్ ల్యాబ్‌లో నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారు షణ్ముగం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. అన్ని రైతు సేవ కేంద్రాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. మండలం ప్రజా ప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమాలో పాల్గొనాలని కోరారు.

టీటీడీకి రూ.2 కోట్లు విరాళం



ప్రజాశక్తి - తిరుమల: హెచ్.సి.ఎల్. టెక్నాలజీస్ చైర్ పర్సన్ రోషణి నాడర్ మంగళవారం టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.2 కోట్లు విరాళం అందించారు. చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి డిడి అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణం పదిలం



ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ నిధులతో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి, మహిళా అధ్యయన విభాగం ఆధ్వర్యంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రామచంద్రాపురం మండలంలోని కుప్పంబాదూరు గ్రామం లో మహిళలకు నిర్వహిస్తున్న 3 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమ నిర్వాహకురాలు మరియు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, డాక్టర్ నీరజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రస్తుత కాలానికి అత్యవసరమని అందుకే యావత్ప్రపంచం ఈ దిశగా అడుగులు వేస్తూ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ మండల టీం లీడర్ విమల, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రాగమ్మ, నాచురల్ ఫార్మింగ్ ఫెలో మేఘన, మాస్టర్ ట్రైనర్లు, ప్రాజెక్ట్ అసిస్టెంట్ జయశ్రీ,, 30 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఐసిడిసిసూపర్వైజర్లు యమునా జ్యోతి మాట్లాడుతూ ఆడపిల్లలకు 21 సంవత్సరములు నిండిన తర్వాత, మగ పిల్లలకు 25 సంవత్సరములు నిండిన తరువాత వివాహం చేయాలని తెలిపారు.బాల్యవివాహాలను అరికట్టాలని, మాతా, శిశు మరణాలు జరగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ కే నాగభూషణమ్మ, పాఠశాల సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి



ప్రజాశక్తి - పాకాల: విద్యార్థులకు ప్రశాంతత ఉంటేనే బాగా చదవగలుగుతారని పాకాల యంఈఓబాబ్జి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక యమ్ఆర్‌సిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిల్డ్రెన్స్ ఫెస్టివల్‌లో భాగంగా జంతువుల జీవన విధానాన్ని తెలియచేసే సినిమా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం 10 వతరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. సెలవు రోజుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిచ కూడదన్నారు. ముందస్తు అనుమతితో విహార యాత్రలకు తీసుకొని పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సి.ఆర్.పి.లు పాల్గొన్నారు.